క్లుప్తంగా

అగ్నిగుండాల మహోత్సవం



నిప్పులపై నడుస్తున్న భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామంలోని అయ్యసాగరం అటవీప్రాంతంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం స్వామివారికి అభిషేకం, ప్రత్యేకపూజలు, అర్చనలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండాలకు మఠం శేఖరయ్య ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం భక్తులు నిప్పులపై నడిచి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎన్టీ పంచాక్షరి, కరుణాకర్‌రెడ్డి, నర్సిరెడ్డి, వీరయ్య, యాదయ్య, యాదగిరిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లప్ప, రాజేశ్‌రెడ్డి, వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మలివిడత కులగణన

ఇబ్రహీంపట్నం: మలి విడత కులగణన గడువు శుక్రవారంతో ముగిసింది. తొలివిడత సక్రమంగా జరగలేదని వివిధ రాజకీయ పక్షాలు, కుల సంఘాల ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేలో పాల్గొనని వారందరికీ మరో దఫా అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన సర్వేలో ఇబ్రహీంపట్నం మండల పరిధి 14 గ్రామపంచాయతీల నుంచి ఆఫ్‌లైన్‌లో నాలుగు, ఆన్‌లైన్ లైన్‌లో నాలుగు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అదే విధంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి నుంచి మరో 13 అర్జీలు అందాయి. ఏది ఏమైనా మలి విడత కులగణనకు ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు.

ఘనంగా టైలర్స్ డే



విలియమ్స్‌హో చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దర్జీలు

ఆమనగల్లు: కుట్టుమిషన్ రూపకర్త విలియమ్స్‌హో జయంతిని పురస్కరించుకుని శుక్రవారం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, అసోసియేషన్ నాయకులు సాయిబాబ, పున్న శ్రీను, కృష్ణయ్య, యాదగిరి, భిక్షపతి, నర్సింహ, కృష్ణ, మహేశ్, గంజి శ్రీను, శంకర్, నాగరాజు, యాదగిరి, గంజి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన

యాచారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ నరేందర్ రెడ్డి పరిశీలించారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు సెంటర్‌ను పరీక్షించారు. తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం గదుల్లో వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో 330 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని కళాశాల సిబ్బంది ఎంపీడీఓకు తెలిపారు.

వైభవంగా నందీశ్వరుడి రథోత్సవం



స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

యాచారం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నందివనపర్తి గ్రామంలోని నందీశ్వరుడి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పోటాపోటీగా రథాన్ని లాగారు.

యూనియన్ బలోపేతానికి కృషి

తుర్కయంజాల్: జిల్లాలో టీయూడబ్ల్యూజే–ఐజేయూను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తొర్రూర్‌లో నిర్వహించిన యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 3వ తేదీ వరకు జిల్లాలో సభ్యత్వ నమోదు చేపడతామని, అనంతరం జిల్లా మహాసభలను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, గుడిపల్లి శ్రీనివాసులు, శ్రీనివాస్, సలీమ్ బాషు, సత్యనారాయణ, జగన్ గౌడ్, రాజేష్, సంరెడ్డి శశిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు గ్రహణం

- ఏళ్లు గడిచినా ముందుకు సాగని వైనం
- అర్ధంతరంగా నిలిచిన పనులు
- మట్టి, ఇరుకు రోడ్లతో వాహనదారుల ఇబ్బంది
- దుమ్ముధూళితో ప్రయాణికుల ఇక్కట్లు



నిలిచిన యాచారం- నక్కర్తమేడిపల్లి రోడ్డు విస్తరణ పనులు

యాచారం: రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో పరుగులు తీయిస్తున్నామని చెప్పుకుంటున్న పాలకులు.. రహదారుల అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. పట్టణాల సంగతి ఎలా ఉన్నా.. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. యాచారం మండల పరిధిలో రోడ్ల విస్తరణ పనులు బీఆర్‌ఎస్ హయాంలో కొన్ని, మరికొన్ని ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ప్రారంభించింది. కానీ పనులు ముందుకు సాగడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా ఏళ్లు గడుస్తున్నా వాటి రూపురేఖలు మారడం లేదు. రవాణా సౌకర్యం మెరుగు పడటం లేదు. అసలు పట్టించుకునే వారే కరువయ్యారు.

> రహదారుల విస్తరణ పనులకు గ్రహణం పట్టింది. ఏళ్లు గడిచినా ముందుకు సాగడం లేదు. అర్ధంతరంగా నిలిచిన పనులతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దుమ్ముధూళితో శ్వాసకోశ సమస్యలతో సతమతం అవుతున్నామని, ముందు వెళ్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు పేర్కొంటున్నారు.

నాటి నిధులతో అసాధ్యం

మండల పరిధి నందివనపర్తి, కొత్తపల్లి, కిషన్‌పల్లి, అయ్యవారిగూడెం, నక్కర్తమేడిపల్లి, మల్కీజ్‌గూడ, నస్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో రూ.వంద కోట్లకు పైగా విలువ చేసే రోడ్డు విస్తరణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కారణం కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు రాకపోవడమేనని తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో పంచాయతీ రాజ్, గిరిజనాభివద్ధి సంస్థ, టీజీఐఏసీ నిధుల ద్వారా ప్రారంభించిన పనులున్నాయి. ఏళ్ల క్రితం ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో, ప్రస్తుతం నిర్మాణ సామగ్రి ధరలు రెండింతలు పెరిగాయి. అప్పట్లో మంజూరైన నిధులతో ఇప్పట్లో ఆ పనులు పూర్తి చేసే అవకాశం ఉండదని ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు.

మట్టిపనులతో మమ

సుమారు రూ.రెండున్నర కోట్లకు పైగా గిరిజనాభివద్ధి సంస్థకు చెందిన నిధులతో బీఆర్‌ఎస్ హయాంలో కొత్తపల్లి- కొత్తపల్లితండా వరకు, పంచాయతీ రాజ్ శాఖ నిధులు రూ.కోటిన్నరతో కొత్తపల్లి నుంచి కిషన్‌పల్లి వరకు రెండు రోడ్లు దాదాపు పది కిలో మీటర్ల బీటీ నిర్మాణం కోసం నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి శిలాఫలకం వేశారు. అప్పట్లో మట్టి పనులు ప్రారంభించి నిధులు సరిగా మంజూరు కాక పనులను వదిలేశారు.

మల్కీజ్‌గూడ మీదుగా..

తాజాగా యాచారం మండల కేంద్రం నుంచి మల్కీజ్‌గూడ గ్రామం మీదుగా నక్కర్తమేడిపల్లి గ్రామం వరకు ఐదు కిలో మీటర్ల రోడ్డు విస్తరణకు రూ.ఆరు కోట్లు పంచాయతీ రాజ్ శాఖ నిధులు మంజూరయ్యాయి. 18 అడుగుల రోడ్డు విస్తరణ చేయాలనే లక్ష్యంతో గత రెండు నెలల క్రితం అధికారులు విస్తరణ పనులు చేపట్టారు. కానీ మధ్యలోనే పనులు నిలిచిపోయాయి.

రూ.72 కోట్లతో ఏడేళ్ల క్రితం



నందివనపర్తి- నక్కర్తమేడిపల్లి రోడ్డు దుస్థితి

రూ.72 కోట్ల టీజీఐఏసీ నిధులతో ఏడేళ్ల క్రితం యాచారం– మీర్‌ఖాన్‌పేట, నందివనపర్తి– నక్కర్తమేడిపల్లి గ్రామాల మధ్య సుమారు 20 కిలో మీటర్ల వంద అడుగుల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. మొదట్లో పనులు చకచకా జరిగినా, క్రమంగా ఆగిపోయాయి. మట్టి రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నారు.

రూ.50 లక్షలతో బీటీ

అయ్యవారిగూడెం– నస్దిక్‌సింగారం గ్రామాల మధ్య కిలో మీటర్నర రోడ్డును బీటీగా మార్చడం కోసం రూ.50 లక్షలకు పైగా పంచాయతీ రాజ్ శాఖ నిధులు మంజూరయ్యాయి. కానీ ఆ పనులు షురూ చేసి వదిలేశారు. ఇవే కాకుండా యాచారం– మొండిగౌరెల్లి, మాల్– మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల మధ్య రీ బీటీ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

దుమ్ముధూళితో ఇబ్బంది



యాచారం– మీరాఖాన్‌పేట గ్రామాల మధ్య రోడ్డు విస్తరణ వెంటనే పూర్తి చేయాలి. పనులు ప్రారంభించి నాలుగేళ్లు గడుస్తోంది. కానీ ముందుకు సాగడం లేదు. మట్టి పనులు చేసి వదిలేశారు. ఫలితంగా దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నాం. శ్వాసకోస సమస్యలను ఎదుర్కొంటున్నాం. విస్తరణ పూర్తిచేసి, రవాణా మార్గం మెరుగు పర్చాలి.
– వన్నెవాడ రవీందర్‌రెడ్డి, నస్దిక్‌సింగారం

ఇరుకుగా..



యాచారం– నక్కర్తమేడిపల్లి రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇరుకుగా ఉండడంతో రెండు కార్లు ఎదురుగా వస్తే భయపడాల్సి వస్తోంది. 18 అడుగుల రహదారి విస్తరణ పనులు మొదలు పెట్టినట్లే పెట్టి ఆపేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టి సారించాలి.
– ఆలంపల్లి నర్సింహ, నక్కర్తమేడిపల్లి

నిధులు మంజూరు చేయిస్తా



ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధి రోడ్లపై దృష్టి సారిస్తా. ఏఏ గ్రామాల్లో రోడ్ల పనులు ప్రారంభించారో, ఎక్కడ నిలిచిపోయాయో తెలుసుకుంటా. నిధులు మంజూరు విషయమై ఆయా శాఖల అధికారులతో సమీక్షిస్తా. నిధులు మంజూరు చేయించి పనులు పునఃప్రారంభం చేయిస్తా.
– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలి

పాడి రైతు సంఘం నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కడ్తాల్: రెండున్నర నెలలుగా పాల బిల్లులు రాక పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని పాడి రైతు సంఘం నాయకుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం విశ్రాంతి భవనంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి సకాలంలో పాల బిల్లులు రావడం లేదని ఆరోపించారు. ఇదే విషయమై పలుమార్లు సీఎం, టీఎస్ డీడీసీఎఫ్ చైర్మన్, విజయ డెయిరీ చైర్మన్‌ను కలిసి విన్నవించామని, అయినా స్పందన లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రాంతంలో రైతులు వ్యవసాయంతో పాటు, అనుబంధంగా పాడి పరిశ్రమను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పాల బిల్లులు అందక వారి జీవనం దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి మార్చి 5 లోగా బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో నియోజకవర్గంలోని రైతులందరం ఆందోళన కార్యక్రమాలు చేపట్టి, సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చేగూరి మహేశ్, నార్లకంటి శేఖర్, నాయకులు మహేశ్, కేశని మహేశ్, మూడ రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, మొక్కలు నాటి పెంచాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక పాలశీతలీకరణ కేంద్రం పరిసరాల్లో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యంతో మానవ మనుగడకు ముప్పు పొంచి ఉందని, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించేందుకు అందరూ బాధ్యతగా మొక్కలు నాటడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్ గుప్తా, సింగిల్‌విండో డైరెక్టర్లు వీరయ్య, సేవ్యా, మాజీ ఎంపీటీసీ గోపాల్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు పత్యానాయక్, హెచ్‌ఆర్‌మహేశ్, శ్రీకాంత్, ఇర్షాద్, రవి, సురేశ్, నర్సింహ, లాయక్‌అలీ, కృష్ణ పాండు తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ మధు

మంచాల: అపరిచితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మధు అన్నారు. శుక్రవారం మండల పరిధి నోముల గ్రామంలో చోరీల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు జేబులో సెల్‌ఫోను, డబ్బులు జాగ్రతగా భద్ర పర్చుకోవాలని సూచించారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు దొంగలు చోరీలకు పాల్పడతారని తెలిపారు. కొత్త వ్యక్తుల పట్ల చాలా జాగ్రతగా ఉండాలన్నారు. ఇళ్లల్లో ఎవరూ లేని సమయంలో చోరీలు జరుగుతుంటాయని, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కెమెరాలు ఉంటే నేరాలను నియంత్రించడంతో పాటు, బాధితులకు సత్వర న్యాయం దొరుకుతుందని, నేరస్తులను త్వరగా గుర్తించే వీలుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ లాలయ్య, నోముల మాజీ ఉపసర్పంచ్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కులగణనకు 17 దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక కులగణన రెండో విడతలో ఆదిబట్ల మున్సిపాలిటిలో 17 దరఖాస్తులు అందాయని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఎన్యుమరేటర్ల వద్దకు 12 దరఖాస్తులు రాగా, 5 అర్జీలు ఆన్‌లైన్‌లో వచ్చాయని పేర్కొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు



సైబర్ నేరాల గురించి అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

ఇబ్రహీంపట్నం రూరల్: యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధి తులేకలాన్ గ్రామంలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. యువతీయువకులు ఆన్‌లైన్ బెట్టింగులతో పాటు మత్తు పదార్థాలకు అలవాటు పడి, అప్పులు చేసి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఫలితంగా వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడుతున్నారని పేర్కొన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా మెలగాలని సూచించారు. సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకుల పేరుతో ఫోన్లు చేసి, ఖాతాల్లోని నగదు కాజేస్తున్నారని తెలిపారు. అలాంటి వారి నుంచి కాపాడుకోవడానికి 1930కి వెంటనే కాల్ చేయాలని సూచించారు. అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని, వేధింపులకు గురైతే 100 ఫోన్ చేయాలని సూచించారు. అవసరమైతే షీటీంకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో సీఐ జగదీశ్వర్, ఎస్ఐ రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి ఉన్నతమైనది

యాచారం: విద్యార్థులకు పాఠశాల స్థాయి ఎంతో ఉన్నతమైందని, గొప్ప లక్ష్యంతో చదువుకోవాలని, చేడు మార్గాల వైపు వెళ్లి, జీవితాలను ఆగం చేసుకోవద్దని ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. శుక్రవారం మండల పరిధి తాడిపర్తి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి అక్కడి సౌకర్యాలు, విద్యా బోధన గురించి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, చిన్నారులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్



తాపీ మేస్త్రీలకు గడియారాలు అందజేస్తున్న సంస్థ ఇంజనీర్ బద్రి

యాచారం: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్ ఎదుగుతుందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి తెలిపారు. మండల పరిధి గునుగల్ గ్రామంలోని బిస్మిల్లా సిమెంట్, హార్డ్‌వేర్ డీలర్ దుకాణాల్లో శుక్రవారం తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతి సిమెంట్ తెలంగాణ రాష్ట్రంలో అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ 5 స్టార్ గ్రేడ్‌ను విడుదల చేసిందన్నారు. ఇంటి నిర్మాణంలో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైనది సిమెంట్ అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయాన్ని అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వెల్లడించారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు గడియారాలను అందజేశారు. సమావేశంలో డీలర్లు మహమ్మద్ ఇక్బాల్, మహమ్మద్ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లప్పగుట్ట జాతర



వ్రతాలు చేస్తున్న భక్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామ సమీపంలోని మల్లప్పగుట్టపై వెలసిన శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో వారం రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం చక్రతీర్థం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఏమిరెడ్డి కౌసల్య, అధ్యక్షుడు మ్యాకం పాండయ్య, గౌరవ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, కార్యదర్శి మల్లారెడ్డి, అడ్వైజర్ శేఖర్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, స్థానికులు నారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, యుగందర్‌రెడ్డి, రంగారెడ్డి, శివుడు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానంతో పాటు విజ్ఞానం ముఖ్యం

జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. మైక్రోస్కోప్, నీటి శుద్ధి యంత్రం, అగ్ని పర్వతం తదితర ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వీటిని పరిశీలించిన విద్యాధికారులు మాట్లాడుతూ.. పాఠశాలస్థాయి నుంచే చిన్నారులు సైన్స్ పట్ల మక్కువ చూపాలని, జ్ఞానంతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు.

- సైన్స్‌ఫెయిర్‌తో సృజనాత్మక వెలికితీత
- విద్యాధికారులు, నాయకులు
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



ఆమనగల్లు: ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ పాండు తదితరులు

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం: విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయదానికి సైన్స్‌ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందని, వారి ప్రతిభకు దోహదపడుతుందని ఆమనగల్లు ఎంఈఓ పాండు అన్నారు. పట్టణంలోని లిటిల్‌స్కాలర్స్ టెక్నో హైస్కూల్‌లో జాయతీ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తయారు చేసిన వివిధ రకాల ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే చిన్నారులు క్రమశిక్షణతో మెలగాలని, చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పాఠశాల చైర్మన్ అల్లాజీగౌడ్, అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి, కరస్పాండెంట్ సుజాతారెడ్డి, డైరెక్టర్ సావిత్రి, ప్రిన్సిపాల్ చెన్నయ్యగౌడ్, ట్రస్మా డిస్ట్రిక్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివలింగం, నాయకులు సుధీర్‌రెడ్డి, శ్రీరామ్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరశర్మ, యాదయ్య, శ్రీశైలం, హైమావతి, శ్రీజన్య, మమత, నవ్య, దీప్తి తదితరులు ఉన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: జ్ఞానంతో పాటు విజ్ఞానం ముఖ్యమేనని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పర్వతాలు అన్నారు. మండలంలోని ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. అందుకు గాను ఉపాధ్యాయులు నూతన ఆవిష్కరణల పట్ల విద్యార్థులను ప్రోత్సహించాలని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాయలు మర్మాలు లేవు

కడ్తాల్: సైన్స్ నిజమని నిరూపితమైందని, ఎలాంటి మాయలు, మర్మాలు లేని శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానికి నిలువెత్తు నిదర్శమని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమయ్య అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రపంచం ఆధునిక యుగంలో అడుగిడుతున్న తరుణంలో.. సైన్స్ ఆవిష్కరణలు మనిషి మేధో సంపత్తికి నిదర్శనమని తెలిపారు. అనంతరం ప్రజల్లో మూఢనమ్మకాలు, వాటి వెనుక సైన్స్ అంశాలను ప్రయోగాత్మకంగా విద్యార్థుల ముందే పరీక్షించి చూపించారు. కాగుతున్న నూనెలో నుంచి మిర్చీలను తీయడం, పేపర్లను కాల్చి వాటి నుంచి కరెన్సీ నోట్లు తీయడం, శివ లింగాలను కడుపులో నుంచి తీయడం తదితర కనికట్టు విద్యలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు రాధాకృష్ణారెడ్డి, వెంకటయ్య, భాగ్యలక్ష్మి, బీముడు, జనార్దన్‌రెడ్డి, శ్వేత మాధురి, గీత, శోభారాణి, గీతాబాయి, సునీత, కౌసల్య, భాగ్యమ్మ ఉన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతో ఆకట్టుకుంది. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులు సంజీవ, ఉదయరాజు, సురేష్, ఆర్ కృష్ణ, డీవీరావు, సురేఖ, శ్రీకృష్ణ, వీరారెడ్డి, నరేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



బరువులు ఎత్తే యంత్రాన్ని ప్రదర్శించిన సతీష్, మణిదీప్

యాచారం: మండల పరిధి కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు తయారు చేసిన కాంతి వక్రీభవనం, మైక్రోస్కోప్, నీటి శుద్ధి యంత్రం, అగ్ని పర్వతం తదితర ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్తు పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ పరీరక్షణలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ప్రతిభ చూపిన చిన్నారులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, శ్రీనువాస్‌నాయక్, అశోక్, వీరమణి, శ్రీదేవి పాల్గొన్నారు.



మాడ్గుల: ఇర్విన్ పాఠశాలలో..



కడ్తాల్: బాలుర పాఠశాలలో..



ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386